క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ. 50వేల విరాళం



నగదు అందజేస్తున్న దాతలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయ నిత్యాన్నదాన కార్యక్రమానికి దాతలు రూ. 50 వేలు అందజేసినట్లు ఈఓ రామక్రిష్ణ ఆదివారం తెలిపారు. కొత్తూరు గ్రామ వాస్తవ్యుడు నందివర్గంలో నివాసముంటున్న శివసాని వెంగళరెడ్డి తన కుమారుడు శిరసాని సాయి సంతోష్‌రెడ్డి జ్ఞాపకార్థం నగదు అందజేసినట్లు చెప్పారు. కుటుంబ సభ్యులు శిరసాని కోటేశ్వరమ్మ, శిరసాని లోకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

భారీ వాహనాలతో రోడ్డు ఛిద్రం



చిన్నటేకూరులో దెబ్బతిన్న రోడ్డు

కల్లూరు: మండల పరిధిలోని చిన్నటేకూరు గ్రామంలో రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రోడ్డుపై నిత్యం భారీ వాహనాలు అధిక లోడ్డుతో తిరుగుతుండడంతో రోడ్డు ఛిద్రమవుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు ఛిద్రమైన దగ్గర ఎదురెదురుగా వాహనాలు వస్తే కొంత సమయం ట్రాఫిక్ అంతరం ఏర్పడుతోందని ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు వాపోతున్నారు. సంబంధిత అధికారు లు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయా లని గ్రామస్తులు, ప్రయాణికులు కోరుతున్నారు.

రేపు సుబ్రమణ్యేశ్వరస్వామి షష్టి



సుబ్రమణ్యేశ్వరస్వామి మూలవిరాట్

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లీ సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి షష్టి నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ రామక్రిష్ణ తెలిపారు. ఉదయం నుంచి స్వామివారికి విశేష పూజలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే ఆలయ ప్రాంగణంలో స్వామివారి కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

భగవద్గీతపై ప్రచారం



ఒండుట్లలో ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

గడివేముల: మండల పరిధిలోని ఒండుట్ల గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, ఆధ్యాత్మిక గ్రంథాలపై త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు రామచంద్రుడు ఆదివారం అవగాహన కల్పించారు. ప్రజలకు భగవద్గీత ప్రతులను అందజేశారు. హిందూ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గోకారి, సుబ్బలక్ష్మి, శీను, రవణమ్మ, హైమావతి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా విగ్రహాల ప్రతిష్ట



శివలింగం, సుబ్రమణ్యేశ్వరస్వామి విగ్రహాలు

పాణ్యం: మండల కేంద్రంలోని తిరుమల గిరిలో ఆదివారం వినాయక, శివలింగం, సుబ్రమణ్యేశ్వరస్వామి విగ్రహాల ప్రతిష్ఠను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పాణ్యం: మండల కేంద్రం పాణ్యం చెరువు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. యువకులు బైక్‌పై వస్తూ మరో బైక్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు చెప్పారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అధిక దిగుడులు.. ధరల్లో కోతలు!

- పొగాకు రైతుకు కడుపు కోత మిగిల్చిన 'చుక్కబర్లీ'
- పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతుల ఆవేదన
- గత ఏడాది కాటసాని జోక్యంతో క్వింటాల్ రూ.15 వేలకు తగ్గకుండా కొనుగోలు
- ఈ ఏడాది ఇష్టారాజ్యంగా కొనుగోలు చేస్తున్నా పట్టించుకోని ప్రజాప్రతినిధులు



బేళ్లను సరిచేస్తున్న పొగాకు రైతులు

ఓర్వకల్లు: గత ఏడాది పొగాకు రైతులకు మంచి లాభాలు రావడంతో ఈ ఏడాది ఎంతో ఆశతో పంట సాగు చేశారు. ప్రభుత్వం నుంచి రైతు భరోసా సాయం రాకున్నా అప్పుల చేసి పంట వేశారు. అయితే పంట కోతకు వచ్చే సరికి కష్టాలు మొదలయ్యాయి. కొనుగోలు సమయంలో పొగాకు నల్లగా ఉందని.. తేమగా ఉందని తదితర కారణాలతో కంపెనీ యజమానులు ధరల్లో విచ్చలవిడిగా కోతలు విధించడం రైతులకు కడుపుకోత మిగిలిస్తోంది.

సాగు విస్తీర్ణం

ఈ ఏడాది అధిక శాతం మంది రైతులు పొగాకు సాగుపై ఆసక్తి చూపారు. దీంతో ఐటీసీ, వీఎస్‌టీ, అలియన్స్ పొగాకు కంపెనీలు ఈ ఏడాది రబీ సీజన్‌లో ఓర్వకల్లు మండలంతో పాటు కల్లూరు, బేతంచెర్ల, మిడుతూరు, నంద్యాల, కోవెలకుంట్ల, వెల్దుర్తి, నందికొట్కూరు, కోడుమూరు, పగిడ్యాల, ఆత్మకూరు తదితర ప్రాంతాల్లో సుమారు లక్ష ఎకరాలకు అనుమతి ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇందులో ఓర్వకల్లు మండలంలోనే దాదాపు 23 వేల ఎకరాలకుగాను 1430 ఎకరాల్లో పొగాకు పంటను సాగు చేయడం విశేషం. వీరందరికీ కంపెనీ ఒప్పందం ప్రకారం చుక్కబర్లీ, నల్లబర్లీ, తెల్లబర్లీ, రిస్టిక, సూరు (బీడీ), సిగరేట్ పొగాకు రకాలకు చెందిన విత్తనాలను నిర్దేశించిన ధరలకు అందజేశారు. ఇందులో రైతులు అధిక శాతం చుక్కబర్లీ, సిగరేట్, సూరు వంటి పొగాకు రకాలను సాగుచేశారు. పంట దిగుబడులు ఆశాజనకంగా రావడంతో సంబరపడ్డారు.

ఇష్టారాజ్యంగా ధరలు నిర్ణయం

రైతులు పండించిన పొగాకు దిగుబడులను కొనుగోలు చేసేందుకు ఓర్వకల్లుతో పాటు, కోవెలకుంట్ల, బ్రహ్మగుండం, నందికొట్కూరు, మిడుతూరు, నంద్యాల, జల్లాపురం తదితర ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. రైతులు ఆశపడి వ్యయప్రయాసాలకు ఓర్చుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకెళితే కంపెనీ యజమానులు ఇష్టానుసారంగా ధరలు నిర్ణయించి నాణ్యత లోపాల సాకుతో కోతలు విధిస్తుండం, లేదంటే రీబేల్ చేయడంతో రైతులు నిరుత్సాహానికి గురవుతున్నారు. మొదట క్వింటాల్ రూ.15 వేల నుంచి రూ.18 వేల ప్రకారం కొనుగోలు చేస్తామని నమ్మబలికారు. తీరా పంట కోతకు వచ్చాక క్వింటాల్ కనిష్ఠ ధర రూ.10 వేలు, గరిష్ఠం రూ.15500 ప్రకారం కొనుగోలు చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటీవల ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన గంగాధర్ అనే రైతు పొగాకును విక్రయించేందుకు 8 బేళ్లు కట్టుకొని వచ్చినట్లు తెలిసింది. పొగాకు నాణ్యత బాగా లేదని రీబేల్ చేయగా, సదరు రైతు ఆత్మకూరుకు తీసుకెళ్లగా 8 బేళ్లు కలిపి సగటున రూ.12 వేల చొప్పున విక్రయించినట్లు తెలిసింది. కంపెనీ సిబ్బంది పనితీరుపై ప్రజా సంఘాలు నిరసనలు వ్యక్తం చేస్తున్నాయి.

కాటసాని చొరవతో కోతల్లో నియంత్రణ

గత ఏడాది పొగాకు కొనుగోలు చేసే సమయంలో క్వింటాల్ రూ.15 వేలకు తగ్గకుండా ధరలు ఉండాలని అప్పటి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కంపెనీ యజమానులకు సూచించడంతో క్వింటాల్‌కు రూ.15 వేలకు తగ్గకుండా ధరలు వేశారు. ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.15 వేలకు మించకుండా కొనుగోలు చేస్తుండడంతో పట్టించుకునేవారు లేరని రైతులు వాపోతున్నారు. రైతులు ఎవరైనా ప్రశ్నిస్తే ఇకపై పొగాకును మా కంపెనీకి తీసుకురావద్దని తేల్చి చెబుతున్నట్లు తెలిసింది. ఇలాగైతే పొగాకు రైతుల పరిస్థితి దారుణంగా మారుతుందని, కనీసం పెట్టుబడులు కూడా రావడం కష్టమేనని రైతులు గగ్గోలు పెడుతున్నారు. రైతులకు జరుగుతున్న అన్యాయంపై ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.

కౌలుకు తీసుకొని పొగాకు నాటాను



మాకు సెంటు పొలం లేదు. ఎకరా రూ.20 వేల చొప్పున 9 ఎకరాలు కౌలుకు తీసుకొని పొగాకు పంటను సాగు చేశాను. మొదట కంపెనీ వారు ఇచ్చిన చుక్కబర్లీ విత్తనం సరిగ్గా మొలవకపోవడంతో ఇతరుల వద్ద రూ. 27 వేలు పెట్టి విత్తనం కొన్నాను. పంట దిగుబడి బాగా వచ్చిందని, మంచి ధర వస్తే అప్పులు తీరుతాయని ఆశించాను. అన్నీ ఖర్చులు కలిపి ఎకరాకు రూ.50 వేల చొప్పున రూ.4.50 పెట్టుబడి పెట్టాను. కంపెనీ వారు ఇష్టమొచ్చినట్లు ధరలు వేయడం వల్ల నష్టపోవాల్సిన పరిస్థితి.

–మహేష్, కౌలు రైతు, హుసేనాపురం

పొగాకు రైతులకు అన్యాయం



పొగాకు పంటకు ధర బాగుందని తోటి రైతులు చెబితే ఎకరాకు రూ.30 వేల చొప్పున 5 ఎకరాల్లో పొగాకు పంటను సాగుచేశాను. మొత్తం రూ.3.50 లక్షలు ఖర్చు వచ్చింది. దిగుబడి బాగానే వచ్చింది. ప్రస్తుతం 23 బేళ్లు తీసుకొస్తే అందులో 15 బేళ్లు రూ.10 వేల నుంచి రూ.14 వేల మధ్య పలికింది. మిగతా 8 బేళ్లు నాణ్యత లోపంతో రీబేల్(సీఆర్) చేశారు. రీబేల్ చేయడం వల్ల బేళ్ల ఇప్పికట్టడం, కూలీలు, రవాణా ఖర్చులకు రూ.10 వేలు ఖర్చు వస్తుంది. ఇలా రీబేల్ చేయకుండా ఎంతో కొంత ధరతో కొనుగోలు చేస్తే బాగుంటుంది.

–ఈర్ల శివుడు, పొగుకు రైతు, రామళ్లకోట

పందిరి డబ్బులు ఇంకా వేయలేదు



పొగాకు పంట నాటే ముందు పంట వర్షాలకు తడవకుండా పందిరి నిర్మించుకోవడానికి ఇనుప కడ్డీలు, టార్పాలిన్లు కంపెనీ వారే ఇస్తారు. అయితే పందిరి కడ్డీలకు మాత్రం రైతులు రూ.12 వేలు చెల్లించాలి. టార్పాలిన్లు మాత్రం ఉచితంగా ఇస్తారు. నేను పందిరికి కావాల్సిన కడ్డీలకు చెల్లించిన రూ.12 వేలు ఇంత వరకు ఇవ్వలేదు. పొగాకు కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాలో డబ్బులు జమచేస్తామని చెప్పి, ఇప్పుడు 15 రోజులకు డబ్బులు వేస్తామంటున్నారు.

–గాజుల గిరిబాబు, సన్నకారు రైతు, ఉయ్యాలవాడ

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం అన్నారు. మండల ప్రజలు సమస్యలపై అర్జీలు సమర్పించవచ్చని తెలిపారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు.

సాగునీటి కష్టాలు



గోనవరంలో కాల్వలో అడ్డు తొలగిస్తున్న రైతన్న

పాణ్యం: మండలంలో ఎస్సార్‌బీసీ చివరి ఆయకట్టుకు సాగునీటి సమస్య తీవ్రమవుతోంది. బ్లాక్ 5 కింద చివరి ఆయకట్టుకు నీరు అందక రైతులు రాత్రింబవళ్లు పడిగాపులు కాసి పంటలను కాపాడుకుంటున్నారు. పది రోజులుగా బ్లాక్ 5 కింద సాగునీటి కోసం రైతులు యుద్ధమే చేస్తున్నారు. కాల్వలో ఎక్కడ చూసినా రాళ్లు, ప్లాస్టిక్ పట్టలను అడ్డు వేసి పొలాలకు నీళ్లు మళ్లించుకుంటున్నారు. చివరి ఆయకట్టుకు నీరు అందక పంటలు ఎండుతున్నాయి. ఆదివారం రాత్రి రైతులు నీటి కోసం కాల్వలో అడ్డుగా ఉన్న రాళ్లు, పట్టలను తొలగించి దిగువకు నీటిని మళ్లించుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో ఎస్సార్‌బీసీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే తమకు ఈ కష్టాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ బ్లాక్ కింద 4,325 ఎకరాల ఆయకట్టు, ఆరు గ్రామాలకు సాగునీరు అందాల్సి ఉంది. అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం రైతులకు శాపంగా మారింది. దిగువన ఉన్న మిరప, మొక్కజొన్న పంటలు నీరు అందక ఎండుతున్నాయి. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకుని సాగునీరు చివరి ఆయకట్టుకు సాఫీగా చేరేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

ప్యాలకుర్తిలో రోడ్లను బాగు చేయరూ



ప్యాలకుర్తిలో దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కోడుమూరు రూరల్: మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలోని అంతర్గత రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. కొత్త సీసీ రోడ్డు నిర్మించాలని సీపీఎం మండల నాయకులు గఫూర్‌మియ్యా కోరారు. ఆదివారం ప్యాలకుర్తి గ్రామంలో సీపీఎం నాయకులు పర్యటించారు. గ్రామంలో దెబ్బతిన్న రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా గఫూర్‌మియ్యా మాట్లాడుతూ.. కోడుమూరు నుంచి ప్యాలకుర్తి మీదుగా గూడూరుకు వెళ్లే వాహనాల వల్ల గ్రామంలో ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిందన్నారు. దెబ్బతిన్న రహదారికి అధికారులు సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతో గుంతలమయంగా మారి అధ్వానంగా తయారైందన్నారు. అంతేకాకుండా గ్రామంలోని కెనరా బ్యాంకు నుంచి దర్గా కట్టకు వెళ్లే రోడ్డు కూడా పూర్తిగా దెబ్బతిందని, చాలా చోట్ల డ్రైనేజీలు దెబ్బతినడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి గ్రామంలో దెబ్బతిన్న అంతర్గత రోడ్లను బాగు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు ఎర్రమద్దిలేటి, వీరన్న, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

దళితుల ఐక్యతను దెబ్బతీసేందుకు చంద్రబాబు కుట్ర



కరపత్రాలను విడుదల చేస్తున్న మాల జేఏసీ నేతలు

కర్నూలు(అర్బన్): షెడ్యూల్డు కులాల ఉప వర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతను దెబ్బతీసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని మాల జేఏసీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్గీకరణకు వ్యతిరేకంగా, క్రిమిలేయర్‌ను రద్దు చేయాలనే పలు డిమాండ్లపై ఈ నెల 23వ తేదీన స్థానిక ఎస్‌టీబీసీ కళాశాల మైదానంలో జరగనున్న రాయలసీమ 'మాలల యుద్ధ గర్జన' భారీ బహిరంగ సభకు సంబంధించి జేఏసీ నేతలు సన్నాహక సమావేశం నిర్వహించారు. జేఏసీ కన్వీనర్ యాట ఓబులేష్ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ ఎస్.నాగప్ప వీధి చెన్నకేశవ హాల్‌లో జరిగిన ఈ సమావేశానికి గోన నాగరాజు, దామోదరం రాధాకృష్ణ, కే.మాధవస్వామితో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన ముఖ్య నేతలు హాజరయ్యారు. మాలల యుద్ధ గర్జనకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. నేతలు మాట్లాడుతూ.. మాల మాదిగలను విడగొట్టాలనే ఉద్దేశంతో రాష్ట్రంలో తప్పుడు సర్వేలు చేయిస్తున్నారన్నారు. మాలలను అణచివేసేందుకు టీడీపీ, బీజేపీ పన్ను తున్న కుట్రలను మాలలు తిప్పి కొడతారన్నారు. పార్లమెంట్‌లో బిల్లు పాస్ కాకుండా, సుప్రీంకోర్టు తీర్పు కేవలం గైడ్‌లైన్స్ మాత్రమేనని, జడ్జిమెంట్ కాదన్నారు. ఎస్సీ కులగణన చేసి 23 శాతం రిజర్వేషన్ పెంచాలనే డిమాండ్లపై జరగనున్న రాయలసీమ మాలల యుద్ధ గర్జనకు లక్షలాదిగా మాలలు తరలిరావాలని పిలుపునిచ్చారు. అలాగే అంబేడ్కర్ విగ్రహం ముందు గర్జనను విజయవంతం చేయా లని నినాదాలు చేశారు. నాయకులు ఎలీషా, శీలం శేషు, వేల్పుల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నగరపాలకలో నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర ప్రజలు స్థానిక సమస్యలపై ఫిర్యాదుల రూపంలో కార్యాలయంలో అందజేయవచ్చన్నారు. ఉదయం 11 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో అర్జీదారులు దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబర్‌తో హాజరుకావాలని సూచించారు.

క్రీడా సాధనతో ఆరోగ్యం

కర్నూలు (టౌన్): విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యం కోసం క్రీడల్లో సాధన చేయాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ సూచించారు. స్థానిక పెద్ద మార్కెట్ వద్ద ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన యూనివర్సల్ బుడోకాన్ కరాటే బెల్ట్ గ్రేడింగ్ పోటీలను ఆయన ప్రారంభించారు. ప్రతిభ చాటిన చిన్నారులకు బెల్ట్‌లను, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

పూల తోట కాదు.. పొగాకు పంట



ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఏదైన పూల తోట అనుకుంటే పొరపాటు. ఇది పొగాకు పంట. మండల పరిధిలోని బస్తిపాడు, లక్ష్మిపురం, బొల్లవరం, పుసులూరు, రెమదూరు తదితర గ్రామాల్లో సాగు చేసిన పంట రోడ్డుపై నుంచి చూస్తే పూల తోటను తలపిస్తోంది. పాదచారులు, ప్రయాణికులను ఆకట్టుకుంటోంది.

–కల్లూరు

నేడు అక్షరాభ్యాస మహోత్సవం



నన్నూరులో వెలసిన సరస్వతీ దేవి

కర్నూలు కల్చరల్: వసంత పంచమి పురస్కరించుకొని సోమవారం నన్నూరు సమీపం రాగమయూరిలోని సరస్వతీ దేవి ఆలయంలో అక్షరాభ్యాస మహోత్సవం నిర్వహించనున్నట్లు శ్రీ విద్యా సుందర సరస్వతి పీఠం పీఠాధిపతి యశోదకుమార శర్మ తెలిపారు. గత 16 సంవత్సరాల నుంచి వసంత పంచమి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారికి అభిషేకం, ఉదయం 8 గంటల నుంచి సరస్వతీ దేవి అష్టోత్తర పూజ, బీజాక్షరాలతో సామూహిక అక్షరాభ్యాసం, సరస్వతి హోమాలు తదితర కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు.

ఫీజు పోరును విజయవంతం చేయండి



ఫీజు పోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆదిమూలపు సతీష్, విద్యార్థి నాయకులు

- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్

కర్నూలు(రూరల్): విద్యార్థుల ఫీజు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 5వ తేదీ వైఎస్సార్‌సీపీ తలపెట్టిన ఫీజు పోరును విజయవంతం చేయాలని ఆ పార్టీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ పిలుపునిచ్చా రు. ఆదివారం తన కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఫీజు పోరుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యార్థులపై కక్ష కట్టిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యా దీవెనకు రూ.2,800 కోట్లు, వసతి దీవెనకు రూ.1,100 కోట్లు మొత్తం రూ.3,900 కోట్లు విద్యాసంస్థలకు చెల్లించాల్సి ఉందన్నారు. కర్నూలు కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే నిరసన కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థి సంఘాలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, పార్టీ కర్నూలు మండల కన్వీనర్ మోహన్‌బాబు, నాయకులు వెంకటేశ్వరరెడ్డి, మణిరెడ్డి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూసీఈ భవన నిర్మాణం ప్రారంభించాలి



ఆర్‌యూసీఈ భవన నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ బృందం

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (ఆర్‌యూసీఈ) భవనాల నిర్మాణ పనులను ప్రారంభించాలని ఎస్‌ఎఫ్‌ఐ ఆర్‌యూ కన్వీనర్ రామకృష్ణ, పీఎస్‌ఎస్ కన్వీనర్ అమర్‌బాబు డిమాండ్ చేశారు. ఆదివారం ఎస్‌ఎఫ్‌ఐ బృందం జగన్నాథగట్టు సమీపంలోని ఆర్‌యూ స్థలాన్ని పరిశీలించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్‌యూసీఈ భవనాల నిర్మాణాలకు ఐదేళ్ల క్రితమే రూ.10 కోట్ల నిధులు మంజూరైనా నిర్మాణాల్లో పురోగతి లేదన్నారు. పునాదులు మాత్రమే వేసి నిర్మాణాలను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. వర్సిటీ స్థలాలు అన్యాక్రాంతమయ్యే ముప్పు ఉందని వాపోయారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని వర్సిటీ స్థలానికి కంచె ఏర్పాటు చేయాలని, వర్సిటీ అధికారులు ఇంజినీరింగ్ కళాశాల భవనాల నిర్మాణంపై దృష్టి సారించాలన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ, పీఎస్‌ఎస్ నాయకులు రాజు, హర్ష, శంకర్, జితేంద్ర, తరుణ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా మామిడి పూత

- రాలిపోతున్న పూత.. ఆందోళనలో మామిడి రైతులు
- సస్యరక్షణతో అధిక దిగుబడులు
- మండలంలో వంద ఎకరాల్లో మామిడి సాగు
- పెరుగుతున్న పెట్టుబడి



ఎల్‌కె తండ గ్రామంలోని మామిడి తోట

గడివేముల: మండలంలోని మెట్ట ప్రాంతాల్లో మామిడి తోటలు పూతతో కళకళలాడుతున్నా చాలా చోట్ల పూత రాలిపోతున్నాయి. మండల పరిధిలోని గని, ఎల్‌కే తండా, మంచాలకట్ట గ్రామాల్లో అధికంగా మామిడి తోటలు ఉన్నాయి. మామిడి పూతలో వివిధ రకాల తెగుళ్లు, పురుగులతో మామిడి రైతులు కలవరపడుతున్నారు. మండలంలో సుమారు వంద ఎకరాలకుపైగా మామిడి తోటలు సాగు చేస్తున్నారు. పూత బాగా రావడంతో ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఈ నెలంతా జాగ్రత్తలు పాటిస్తే మంచి దిగుబడులను సాధించవచ్చని భావిస్తున్నారు. ప్రారంభంలో తేనె మంచు, బూడిద తెగులు, మసి మంగు, ప్రస్తుతం మంచుతో పాటు, పగటి, రాత్రి ఉష్ణోగ్రతల్లో వచ్చే వ్యత్యాసాల కారణంగా పూత రాలిపోతున్నాయి. తామర పురుగులు సోకే అవకాశం ఎక్కువగా ఉంది. తామర పురుగు వల్ల కాయల నాణ్యత తగ్గుతుందని, తద్వారా మార్కెట్‌లో ధర పడిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

చీడపీడల నివారణకు చర్యలు

మామిడి తోటల్లో తేనె మంచు పురుగు, తామర పురుగు, బూడిద తెగులు లేత కొమ్మలను ఆశించి నష్టపరుస్తాయి. తేనెమంచు పురుగు తల్లి, పిల్ల పురుగు లేత ఆకులు, పూల కొమ్మలపై గుంపులు గుంపులుగా చేరి రసం పీల్చుతాయి. దీంతో కాడలు, కొమ్మలు ఎండిపోయి పూత ఏర్పడదు. ఈ పురుగు తేనెలాంటి పదార్థాన్ని విసర్జించడంతో శిలీంధ్రాలు ఆకర్షించబడి కాడలు, ఆకులపై మసి లాంటి పొర ఏర్పడి కిరణజన్యసంయోగక్రియ జరగదు. దీంతో చెట్టుకు కావాల్సిన పోషకాలు అందవు. దీని నివారణ కోసం ఒక మాసంలో కార్బలిన్ 3 గ్రాములు, ఆర్థిన్1 గ్రాము, సువాన్1 మి.లీ, వేప నూనె 5 మి.లీ, కార్బన్‌డిజం ఒక గ్రాము లేదా మ్యాంకోజబ్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి చెట్టు, కాండం, కొమ్మల నుంచి ఆకులు తడిసేలా పిచికారీ చేయాలి. తామరపురుగు లేత కొమ్మలను ఆశించి రసం పీల్చడం ద్వారా పూల కొమ్మలు రాతి రంగుకు మారి మాడిపోతాయి. దీని నివారణకు రీజెంట్ 2 మి.లీ, ఎసిఫేట్ 1.5 గ్రాములను నీటిలో కలిపి లేత కొమ్మలపై పిచికారీ చేయాలి.



మామిడి రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్న ఉద్యనవనశాఖాధికారులు

పెరిగిన పెట్టుబడి

వాతావరణంలో నెలకొన్న పరిస్థితుల కారణంగా డిసెంబర్ నెలలో సమయానికి పూత రాలేదు. నెల రోజులు ఆలస్యంగా పూత రావడంతో పురుగు ప్రభావం అధికమైంది. వచ్చిన కొద్దిపాటి పూత కూడా.. జనవరిలో మంచుదెబ్బకు రాలిపోయింది. తేనె మంచు పురుగు కారణంగా పూత నల్లగా మారిపోతోంది. పిందెలు రాలిపోతున్నాయి. తామరపురుగు ప్రభావంతో మరింత నష్టపోతున్నారు. నివారణకు రైతులు వారానికి ఎకరాకు రూ.6 వేల చొప్పున ఖర్చు చేయాల్సి వస్తోంది. ఎకరాకు దిగుబడి ఒక టన్ను వస్తుందో లేదో అని కొందరు మామిడి రైతులు వాపోతున్నారు.

ఆందోళన వద్దు



మామిడి పూత అధికంగా వస్తోంది. రాలిపోతున్నా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. రాలిపోయేదంతా మగపూత మాత్రమే, ఆడ పూతకు పిందెలు వస్తాయి. మామిడి రైతులు యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులను పొందవచ్చు. ఇప్పటి నుంచే రైతులు అప్రమత్తంగా ఉండి తెగుళ్లను అరికడితే అధిక దిగుబడులు సాధించవచ్చు. మామిడి రైతులకు ఎప్పటికప్పుడు అసరమైన సూచనలు, సలహాలు ఇస్తున్నాం.

–దివ్య, ఉద్యానవనశాఖాధికారిణి